భగ్న ప్రేమ

సీతా రాములమధ్య: ప్రేమలత అతి గోముగా పెరిగింది
కాని ధనాభావము ఆ లతకు వేరు పురుగయింది.

రచయిత్రి :
ఇందిరా దేవి

అవి నేను చదువుకునే రోజులు. ఆ యేడు వేసంగి సెలవులు యివ్వగానే మా స్వగ్రామం వుడాయించాను. లేతముంజలూ, మామిడిపండ్లూ, పనసపండ్లూ నిత్యం నైవేద్యాలు అవుతాయన్న ఆశతో.

నేను మా వూరు వెళ్ళిన పది రోజులకి మా అక్కయ్యకి సూడిద పట్టుకు వెళ్ళడానికి సరంజాం చేస్తూ వుంది మా అమ్మ.

మా అక్కయ్య అంటే మా పెత్తల్లికూతురు. ఆమె తల్లి చిన్నతనంలోనే నూతిలోపడి చనిపోయింది. అప్పటినుంచీ మా అమ్మే ఆమెను పెంచింది. నేనంటే అక్కకు అపరిమితమైన ప్రేమ. తమ్ముడూ! అని ఎంతో ముద్దుగా పిలుస్తూవుండేది. చక్కగా తలదువ్వి బొట్టుపెడుతూ వుండేదిమా అమ్మకి నేను పుట్టేవరకు ఆడపిల్లలు లేరు. మా అక్కయ్యఅంటే అమ్మకు ఆప్యాయంగావుండేది. అక్కయ్యకు యుక్తవయస్సు రాగానే ఎదురు మేనరికం ఇచ్చి పెండ్లి చేసింది అమ్మ.

మా మేనమామలు చాలా మోతుబరులు. ఇచ్ఛాపురంలో భూములు, సగానికిసగం వారివే. ఆ వూరికి దక్షిణంవైపు ఒక పెద్ద చెరువుంది. చెరువుకి పడమటివైపు పెద్ద తోట ఆ తోట నానుకుని ఒక కొండదాని చుట్టూ యింకా చిన్న చిన్నకొండలు వున్నాయి. అక్కడి ప్రకృతి చాలా రమ్యంగా వుండేది.

మా మేనమామలు ముగ్గురన్నదమ్ములు. పెద్దమామ కొడుక్కియిచ్చారు అక్కయ్యను. మా రెండో మేనమామగారికి నలుగురు కొడుకులు యిద్దరు కూతుళ్ళు, మూడో మేనమామగార్కి ఒక్కర్తే కూతురు ఆమె పేరు సీతాదేవి లేక లేక చాలాదినాలకి పుట్టింది. మా మేనమామభార్యకు కూతురంటే పంచప్రాణాలు అన్నమాట. ఒకసారి ఆ పిల్లమీద ప్రేమకొద్దీ పొరుగూరిలో వున్న పిల్లకొరకు బుట్టెడు సపోటాపళ్ళు వట్టినే కుళ్ళబెట్టింది ఎవరికీ పెట్టకండా దాచి.

మా అమ్మ మా తాతగారి వూరు వెళ్ళినప్పుడు అల్లా నేనూ సీతా చిలకా గోరివంకలాగ ఆడుకుంటూ వుండేవాళ్ళం. మా అమ్మమ్మ మినపరొట్టె, వండి పెడుతూ వుండేది ఆడుకోమని ఆ వేసంగిలో మా తాతగారి వూరు మా అమ్మ వెడుతోంది అనేసరికి యీ చిన్నతనపు చేష్టలన్నీ ఒక్కసారిగానా దృక్పథాన్ని నృత్యం చేసాయి.

మంచిరోజు చూసి మా అమ్మ రెండు కొత్త బిందెలనిండా పంచదార చిలకలుచినా మిరాయి మొదలైనవి అమర్చి పసుపుగుడ్డలు వాసినికట్టింది ఒక అరిటిపళ్ళగెలా పసుపుకొమ్ములు కుంకుమ ఒక బుట్టలో పెట్టింది, అన్నీ సిద్ధమైన తరువాత సాయంకాలం అన్నాలు తిని చల్లప్రొద్దున నెలపొడవగానే రెండెడ్లబండి కట్టుకొని ఝామంప్రొద్దు ఎక్కేసరికి ఇచ్ఛాపురం చేరుకున్నాము.

నేను బండి దిగేసరికి ఎప్పుడు వచ్చావు బావా! అంటూ ఉషకాంతులకు వికసించిన పద్మంలా కలకలాడే ముఖంతో పరుగునవచ్చి నా చెయిపట్టుకుంది సీత. ఆ స్వాగతానికి నా హృదయం ఉప్పొంగిపోయింది.

ఒకనాడు సాయంకాలం చక్కగా తలదువ్వుకొని వాలుజడ వేసు

కొని కంటినిండా కాటుక పెట్టుకొని దక్షిణాది పరికిణీ కట్టుకొని శేలం కండువా పమిట వేసుకొని ముద్దులా నిద్రపోతున్న నా దగ్గరకు వచ్చి వీపుమీద చరిచి యింకా నిద్రే కుంభకర్ణుడు చచ్చిపోతూ నీకిచ్చి పోయాడేమిటి బావా నిద్ర! లే! అని పకపక నవ్వసాగింది ఆ నవ్వు నాకు అంకుశంలాగ గ్రుచ్చుకుంది. చివాలున లేచి ఏం పుట్టిమునిగిందే అంటూ కండ్లు నులుపుకుంటూ వున్నాను నిద్ర బద్ధకంచేత. నా రెండు చేతులు ముందుకి లాగి తోటలోకి షికారు వెడదాం వస్తావా! అంది అతిమధురంగా.

నిద్రముఖం కడుకుని తెల్లచొక్కా పంట్లాం తొడుకొని తయారైయాను షికారుకి.

మాతో మా బావ కూతుళ్ళు మా చెలెంద్రుకూడా తయారైనారు.

మేము అందరమూ బండి ఎక్కి చెరువుప్రక్క తోటలోకి వెళ్ళాం.

ఆ తోట ఆ రోజుల్లో నందనవనంలావుండేది. ఒకమాటు నుయ్యి కూడా వుంది.

తోటలోకి వెళ్ళేటప్పడికే కుర్రాళ్ళు దాహమన్నారు. నూతి దగ్గరకు తీసుకుని వెళ్ళి మంచినీళ్ళు యిప్పించాను.

రత్నం :—మామయ్యా! ముంజకాయలు కొట్టించవూ? అని.

జానకి:—మామయ్యా! ముందు కొబ్బరికాయలు తీయించు అని, నలుగురూ నాలుగుమూలలా దుయ్యబట్టుకొన్నారు వీళ్ళందరూ నీకుతోవుంటే మా సీతాదేవి నాకేసిచూసి పకపక నవ్వింది, దాని నవ్వులో నేను పిల్లలతండ్రి నయ్యినట్టుగా తోచింది.

సీత ముంజలు తిని చేతులు కడుకునివచ్చి ఆ చేతులు నాకు తుడుస్తునట్టు తెలియకుండా వుండాలని వెనకగావచ్చి రెండు చేతులు భుజంమీద వేసి బావా! సంపెంగపువ్వు మంచి సువాసనగా వుంది ఎక్కడుందో వెతికి కోసి పెట్టవు అంది ఆ సమయంలో పైకిచూసేసరికి ఆమె కళ్ళలో నాకో ఏదో అర్థంకాని వెలుగు గోచరించింది. అహో అది ఎంతపని అని నూతిదగ్గరవున్న సంపెంగపొద గాలించాను. బాగాపండి ఘుమఘుమలాడిపోతున్న సంపెంగ పువ్వులు ఐదు దొరికాయి. నీ యిష్టము వచ్చినన్ని తీసుకో అన్నా. ఆకులతోవున్నవి మూడు తీసుకుంది. మిగతావి పిల్లలు తీసుకొన్నారు. పువ్వులను కసేపు చేతులోనేవుంచుకుని దిక్కులు చూసింది. పెట్టుకో చూస్తావేం అన్నా. 'నేను పెట్టుకుంటే జుత్తు రేగిపోతుంది నీవే పెట్టు బావా!' అంది.

సూర్యుడు అస్తమించాడు.

కొండ శిఖరం అగ్ని పుంజంలా వుంది. కాని తూర్పువెంపు మామిడిచెట్లతోను చిన్ని చిన్ని పొదలతోను మనోహరంగా వుంది.

బావా! కొండ ఎక్కాలి యీ వేళ అంది మా సీత. నీకు ఓపిక వుందా అయినా పొద్దుపోయింది పెందరాళే యిల్లు జేరకపోతే తిడతారు యీ పిల్లలతోటి అన్నా పెదబాధ్యత వున్నవాడిలా.

ఈ వేళ వున్నమోయి బావ. పొద్దుపోయినా ఫరవాలేదు లే మళ్ళీ ఎప్పుడు వస్తావో నీవు ఒకసారి కొండఎక్కి చూసివద్దాం రా అంది.

పిల్లలను బండివానికి అప్పగించి మేమిద్దరం కొండ ఎక్కాం. సగానికి ఎక్కేసరికి అలసిపోయింది. ఇంక ఎక్కలేనని ఒక పాషాణం మీద చతికిలబడింది. ఇంతేనా అంటూ నేను క్రిందకి దిగివచ్చి ఆమె వెనకాల కూచున్నా.

పండు వెన్నెల పిండిఆరపోసినట్టు అయింది. ఆ కొండ ఆ సుధాకరుని బాహువల్లరిలో వెండి కొండలా వుంది.

మామిడిచెట్లమీద కోవిలలు కుహూ కుహూమంటే మా సీత వాటిని ఎక్కిరిపిస్తోంది తనూ ఒక కోకిల అనుకొని. ఎదుటవున్న చెరువులో కుముదలు ఆమె కూతలకు పరిహాసంగా నవ్వుతున్నవా అన్నట్టు కలకలనిచ్చాయి. ఆ నీటిమీద నుండి వచ్చే గాలులు చల్లగా అహ్లాదకరంగా వున్నాయి.

బావా! యీ వేళ చంద్రబింబం ఎంత బాగుందో చూసావా అంటూ నామీదకు వరిగి నా మోకాళ్ళ మీద ఆమె శిరమును వుంచింది.

సీతనుకూడా మా అమ్మ. మా వూరు తీసుకొచ్చింది అమ్మవారి తీర్థం నెపంపెట్టి, మా అత్తకు మొదట్లో కూతురును పంపడానికి యిష్టంలేదు యీడువచ్చిన పిల్ల అని. కాని తల్లితరువాత మేనత్త కదా అని పంపింది.

బండిలో ఆమె సరసను కూచుంటే నాకెంతో హాయి అనిపించింది. సీత తన కోడలవుతుంది అనుకునేది. మాఅమ్మ మాఅన్యోన్యతచూసి.

అది వైశాఖ పూర్ణిమ పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. ఆ రోజు మావూరి అమ్మవారి జాతర.

రాత్రి పండ్రెండుగంటలయి వుంటుంది, అత్తా శ్రీరామమూర్తిని నన్ను జాగరానికి తీసుకువెళ్ళమనవూ అంది గారాంగా. అదెంత భాగ్యమమ్మా దొడ్డిగుమ్మంలోకి వెళ్ళి చూసిరండి అంది మా అమ్మ ఆమాట దొరబుచ్చుకొని మాంగన్నుగా నిద్రపోతున్ననన్ను రెక్కపట్టిలాగి బావా! రామరి వెడదాం జాగరానికంది, మనం వెళ్ళకూడదే! ఆ మాలసంతలోకన్నా బద్ధకంచేత అయితే యింతోటి మాలతీర్థానికేనా నన్ను కోరి తీసుకొచ్చావంది నామాట నాకు వప్పగిస్తూ, నాకు మెరుపుదెబ్బ తగిలినట్టు అయింది సరే పద అంటూ తూలుతూ ఆమె వెంటనడిచాను పెరటి గుమ్మందగ్గరకు వెళ్ళేసరికి మల్లిమొగ్గలు అరవిచ్చి మమ్ములను పరిహసిస్తున్నట్టు వున్నాయి. చేమంతిపూలు వికవిక మంటున్నాయి. బావా! గుడిదగ్గర బాజాలులేవే కాసేపు యీ దొడ్లో అరుగుమీద కూచుందాం వచ్చాక వెడదామని నా రెక్కపట్టుకు లాగి తనవళ్ళో కూచోబెట్టుకుంది. అక్కడ కూచుని ఏవేవో మధురభావాలను తలపోసుకున్నాం. బావా! నీచేయి ఏది అని చూసి నీవుంగరం నాకు సరిపోయిందంటూ నావుంగరం తాను ధరించింది ఆ రాత్రి.

ఆమరునాడు తీర్థంలో నేనూ సీత కలసి గుళ్ళోకి వెళ్లాం పళ్లు యియ్యడానికి ఆచాకల ముండావాడు నాకేసి సీతకేసి చూసి బాబయ్యగారికి యీయేడు పెళ్ళిఅయ్యేట్టు దీవించుతల్లీ ! అంటో మొక్కాడు మేముయిచ్చిన పళ్లు మూలపడేస్తో సీత నవ్వింది ముసిముసిగా.

ఆమరునాడే మా మేనమామ బండి పంపుతూ తాను వన సంతర్పణ చేస్తున్నానని అందరూ వక్కసారివచ్చి వెళ్ళవలసిందని వర్తమానం పంపాడు అమ్మా సీత పిల్లలు అంతా వెళ్ళారు నేను వుండిపోవలసి వచ్చింది.

సీత వెడుతో బావా! వెళ్ళివస్తాను జ్ఞాపకం పెట్టుకోవేం అంది జాలిగా నాచేతిలో చేయివేసి. అంతే నేను చదువుకొరకు చెన్నపట్టణం వెళ్ళాను. నేను చెన్నపట్టణం వెళ్ళిన సంవత్సరమే. సీతకు వివాహం అయింది. సీత తల్లికి తనకూతుర్ని ఒక జమీందారుకి యియ్యాలనివుండేది. మా మేనమామ ఎంత పట్టుపట్టినా మాబీదతనంచూసి మా అత్త ఈ సంబంధానికి వప్పుకోలేదు. పిల్ల వుద్దేశం కూడా కనుక్కోకండా పట్టుపట్టి పెండ్లిచేసింది. దానిని పెండ్లి అంటారు పెద్దలు. కాని సీతకు అది ఒక బలివంటిది. తల్లి ధనకాంక్షకు తనను బలియిచ్చిందని అంటుంది.

అహం బ్రహ్మాస్మి

పెర్షియా సుల్తాన్ దగ్గరకు, ఒకరోజున ఒక పిచ్చివాణ్ణి పోలీసులు పట్టుకు వచ్చారు.

అతడు చేసిన నేరం ఏమిటని సుల్తాన్ అడిగాడు.

'తను భగవంతుణ్ణని చెప్పుకుంటున్నాడు' అని భటులు జవాబు చెప్పారు.

సుల్తాన్‌కు నిజంగా కోపం వచ్చింది.

"భగవంతుడి దూతనని చెప్పుకుంటూవున్న ఒక పిచ్చివాణ్ణి ఈ మధ్య ఉరితీశా తెలుసునా?" అని సుల్తాన్ దబాయించాడు.

ఆ పిచ్చివాడు బెదరకుండా ఇలా అన్నాడు.

"వెధవకి మంచి పనిచేశారు; నేను నా దూతగా ఎవర్నీ ఇక్కడకు పంపించలేదు."

—ఒక చాటు కథ.